# మినీ కథలు

## ఇది ప్రకటనల యుగం

### పుల్లూర్లమూడి కృపాచారి

సెలవు రోజు ఉదయం పాలవాడు రాకపోయేసరికి గృహస్తు పాట్లు మొదలు. పాలకోసం రోడ్డునపడ్డా. ఉదయాన్నే మైకులో ప్రకటనలు విన్పించేసరికి చికాకనిపించింది. కాన్వెంటు



ముందు పెద్దహోర్డింగ్‌పై నిరోధ్ ఎక్స్‌ప్రెస్ యిక్‌మెంట్ చూసి నలుగురు పిల్లలు "ఆనందానికి నిరోధ్ వాడండి" అని పెద్దగా చదివి "నిరోధ్ అంటే మనం వూదుకునే బుడగలేగా-అవి వూదుకుంటే ఆనందంగా వుంటామని అర్థం" అని అనుకుంటూవుంటే వాళ్ళ సమన్వయానికి నవ్వుకుంటూ వెళ్ళా.

తంటాలుపడి పాలు తెచ్చియిచ్చి వెనక్కుమాసేప్పటికి. పేపరు వాడు వాకిట్లో పేపరు విసిరేసి వెళ్తున్నాడు. నీహ తేటయిందా అని మనసులోనే తిట్టుకుని పేపరు తిరగేస్తుంటే ప్రకటనలు, అభినందన అనుబంధాలు, సంస్మరణ అనుబంధాలు చూసి వార్త లెక్కడున్నాయా అని వెతుకుతున్నా.

అప్పటివరకూ భక్తి గేయాల పేరిట శాస్త్రీయం, అశాస్త్రీయం జోడించి వేసే సినిమా పాటలు, ఉద్యోగ వార్తలు, విచిత్ర వార్తలు, సంక్షేమ వార్తలు వగయిరా తర్వాత హిందీ వార్తలు రాగానే అర్థం కావని మా అయిదేళ్ళ చందన స్టేషన్ మార్చింది.

పేపరులో లీనమైవున్నా. ఐదునిముషాల తర్వాత అకస్మాత్తుగా మా చందన వచ్చి "నాన్నా! మనం ఆనందంగా వుంటున్నామా. లేదా?" అనంటే-'ఏమ్మా' అని ప్రశ్నార్థకంగా కళ్ళజోడు సవరించుకున్నా. "అది కాదు నాన్నా రేడియోలో ఆనందానికి లూపు వాడమంటున్నారు. మనందరం లూపు వాడదాం నాన్నా ఆనందంగా వుందొద్దూ" అని గుక్క తిప్పుకోకుండా అమాయకంగా అంది. ఆ మాటకి అవాక్కయి ఏం సమాధానం చెప్పాలో తోచక చూస్తును కదా యిల్లాలు తుఫానులా "ఈ కాఫీ పొడి బాగోలేదు. నిన్న సినిమాలో చూపెట్టిన ఇన్‌స్టాంట్ కాఫీ పట్రండి" అంటూ కప్పు అందించింది. వేడి కాఫీ వాలికి వేళ్ళు చుర్రుమన్నాయి. 'ఇది ప్రకటనల యుగం' అనుకుని సెగలు కక్కుతున్న కాఫీ కప్పు నేపు చూశా. ●

కోనసీమ పేరు చెపితే కొబ్బరి బొండాలు గుర్తొస్తాయి.

అక్కడి అంబాజీపేట పనసపళ్ళకు ప్రసిద్ధి.

హైదరాబాదులో అనాబ్ షాహి ద్రాక్ష తోట చౌక.

విజయనగరం మామిడి తాండ్రకీ. తాపేశ్వరం కాజాలకీ. బందరుమిఠాయికి..ఇలా చెప్పుకొంటూ పోతే ప్రసిద్ధస్థలాలుచాలా వుంటాయి. "ఫలానా చోటకు వెళ్తున్నాను అంటే-అక్కణ్ణుంచి ఫలానాది తెచ్చిపెడుదూ" అని తెలిసినవాళ్ళు పురమాయించడం పరిపాటి. కాశీలో గాడిద గుడ్డు తేరగా వస్తుందంటే తెచ్చిపెట్టమనే వాళ్ళు సుఖంగానే వుంటారు. కాని, తెచ్చేవాళ్ళకు కాళ్ళనొప్పులు, చేతి చమురు తప్పవు. కర్మకాలి, నాది ఊళ్ళు తిరిగే ఉద్యోగం గనుక ఇలాంటి బేరాలు నాకు తరచు తగుల్తుంటాయి; కాని నావల్ల కాదని నిర్మొహమాటంగా చెప్పేస్తుంటాను. కారణం నేనెక్కడి కెళ్ళినా తరుగే- ఏంచేసినా తరుగే....మిత్రులందరూ నాకు ఆప్యాయంగా యిచ్చిన బిరుదు- "తరుగు".

సినిమాకి వెళ్తే మా మిత్రులెవరూ 'క్యూ'లో నా వెనక మాత్రం నిల్చోరు—నా వరకు వచ్చేసరికి టికెట్లు గ్యారంటీగా అయిపోతాయని వాళ్ళకి గట్టి నమ్మకం.

'రమ్మీ' ఆడుతుంటే—నాది 'కార్డ్ షో' అని ప్రకటించినా మిత్రులు కౌంట్ నిర్భయంగా ఆడి నెగ్గేస్తారు. ఆ ఒక్క ముక్క నాకు రాదని వాళ్ళ ధీమా.

నేను లాటరీ టిక్కెట్టు కొంటే ఆ నంబరు దగ్గర్లోవుండే టిక్కెట్లు ఎవరూ కొనరు—ఆ ప్రాంతానికి జ్యేష్ఠాదేవి తప్ప భాగ్యలక్ష్మి రాదని వాళ్ళ విశ్వాసం.

మంచి ప్రోగ్రాం పెట్టుకున్నప్పుడు కరెంటు ఫెయిలయితే మిత్రులనే మొదటి మాట—"తరుగు కాలు పెట్టివుంటాడు."

నా మార్కుల లిస్టు రాగానేమిత్రులంతా ఎగబడిచూస్తారు. జోళ్ళ ధరల్లా ఒకటో అరో తక్కువొచ్చి క్లాసు తప్పడం తథ్యం.

ఇంటి పేరు కస్తూరి వారు,ఇంట్లో గబ్బిలాల కంపు అని.. పేరు 'విజయ్' అయినా పని అంతా తరుగేనని నా జీవితం నుంచి ఇలా ఎన్నయినా చెప్పుకోవచ్చు. అందుచేత నా తరుగు మిగతా వాళ్ళకు సంక్రమిస్తుందనే భయంతో నేనెవరికీ ఏమీ తీసుకొచ్చే మొగమాటాలకు పోను. కాని ఈ మాట చెపితే మా అమ్మ

మాత్రం కోప్పడుతుంది— కాకి పిల్ల కాకికి ముద్దు. పైన చెప్పిన ప్రసిద్ధ స్థలాలకు వెళ్ళి, వట్టి చేతులతో వస్తే అమ్మ ఊరుకోదు. అందుకని కొన్నధర కొంత తగ్గించి చెప్పి అమ్మను తృప్తి పరుస్తుంటాను

మా తమ్ముడు అజయ్ నాకు పూర్తిగా వ్యతిరేకం. లాభ సాటి బేరం వాడి సొత్తు. పెద్ద షాపుల్లో బేరాలాడితే నవ్వుతారని నేను మొహమాటపడతాను. కాని వాడు షాపువాళ్ళనే మొహమాట పెడతాడు. షాపు వాళ్ళు అయిదు శాతం డిస్కౌంట్ యిస్తానంటే దాన్ని పది శాతం వరకు పెంచే మాటకారి అజయ్. ఈ తేడాని పసికట్టిన అమ్మ 'పెద్దాడు నోట్లో నాలుక లేనివాడు-ఎలా బ్రతుకుతాడో. ఏమో?' అని జాలిపడుతుంటుంది.

అలాంటి తరుగుమొహం ఇవాళ భాగ్యనగరం నుంచి వస్తూనే కళకళ్ళాడడం ఇంట్లో వాళ్ళని యిబ్బంది పెట్టింది. నా చేతిలో "బ్రీఫ్ కేస్"తో పాటు మరో బుట్టకూడా వుండటం వాళ్ళ నాశ్చర్యపరిచింది.

"ప్రమోషనా?" "కానుకా?" "లాటరీయా?" అమ్మ. తమ్ముడు. చెల్లి నవ్వుతూ వేసిన ప్రశ్నల పరంపర.

"నవ్వండి. నవ్విన నాపచేనే పండుతుంది" అనలేదు నేను- అనుకున్నాను గర్వంగా. హైదరాబాద్ అనాబ్ షాహి ద్రాక్ష కొనడం మరిచిపోయిన నాకు రాజమండ్రి వచ్చేసరికి అమ్మ ఈసారి తప్పనిసరిగా తీసుకురమ్మన్న విషయం గుర్తొచ్చింది. చేసేదిలేక రాజమండ్రిలోనే అయిదో ఆరో పెట్టి కొని మూడు రూపాయలకే హైదరాబాద్‌లో కొన్నానని అబద్ధం ఆడేద్దామని నిశ్చయించుకున్నాను. తీరా మార్కెటులోకి రిక్షా వచ్చేసరికి నా అదృష్టం కొద్దీ ఓ కుర్రాడు కె జి నాల్రూపాయలే చెప్పాడు. నేను అవకాశం దొరికిందని తెలివితేటలు ఉపయోగించి బేర మాడాను మూడ్రూపాయలు చొప్పున ఇస్తేఅయిదు కేజీలు కొంటా నని. పాపం! అ కుర్రాడికి ధర సరిగ్గా తెలియను- అర్ధ పావలా పెట్టమని అడిగి చివరకు మూడు రూపాయల కివ్వడానికి ఒప్పేసుకున్నాడు. నాకు లగేజి బాధకూడా తప్పింది. నా ఘనవిజయాన్ని సగర్వంగా ప్రకటించాను.

"రాజమండ్రిలో ద్రాక్ష కేజీ మూడు రూపాయలా?ఇంపాజిబుల్. నువ్వేదో అబద్ధం చెపుతున్నావు. ఓ గంట క్రితమే మామయ్యగారి షాపునుంచి మెహర్బానీ మీద కేజీ నాలుగు రూపాయలకి తీసుకొచ్చాను. బంధువుల్నికూడా ఇలా మోసం చేస్తారన్న మాట...." అంటూ అజయ్ ఆవేశపడిపోయాడు.

అంతలోనే పాపారావు మావయ్య గుమ్మంలో అడుగు పెట్టాడు.

"ఏం మావయ్యా?-కొత్త మేడకేదైనా పునాది వేశావా?" గుమ్మంలో నిలబెట్టి అజయ్ వేసిన ప్రశ్నకు నిర్ఘాంతపోయాడు పాపారావు. అతను మాకు వేలు విడిచిన మేనమావ. బ్రతికిచెడిన వాడు. రాజమండ్రి కోటగుమ్మం దగ్గర పళ్ళ షాపు పెట్టాడు. వ్యాపారానికి పెట్టుబడి అవసరమొచ్చినప్పుడు అడపాతడపా మా యింటికొస్తాడు.

ద్రాక్ష పళ్ళ ధర గురించి-అజయ్ మావయ్యని కడిగేశాడు. అమ్మ కూడా నిష్ఠూరంగా మాట్లాడింది. మావయ్య మొహం వెలెవాడు

"ఈ వూళ్ళో ఎవరూ అయిదు రూపాయలకి తక్కువ అమ్మరు. మా కిట్టుబాటు ధరకే అజయ్‌కి మా వాళ్ళు ఇచ్చుంటారు. విజయ్‌కి మూడు రూపాయలకే యివ్వడం విచిత్రం" మావయ్య నసుగుతున్నాడు. మావాళ్ళు నమ్మడం లేదు.

నాకు కేజీ మూడ్రూపాయల కిచ్చిన ఆ కుర్రాడి మొహం గుర్తుకొచ్చి జాలిపడ్డాను — పాపం. ఆ అమాయకుణ్ని పెద్దాళ్ళు మొహం వాచేలా చివాట్లు పెటివుంటారని.

ఇంతలో మావయ్యకేదో స్ఫురించి "విజయ్,నువ్వు తీసుకొచ్చిన పళ్ళేవి?" అంటూ నా దగ్గర బుట్ట తీసుకున్నాడు. పళ్ళు తాజావే. తల పంకించి. త్రాసు తెప్పించమన్నాడు.

"మరీ అమాయకుణ్ని చేస్తున్నావ్ మావయ్యా- నా కళ్ళు బాగానే కనిపిస్తున్నాయి.... ఇంకా కళ్ళజోడు అవసరం రాలేదు. రెండు కేజీల రాళ్ళు రెండు. కేజీ రాయి ఒకటి వేసి నా కళ్ళముందే తూచాడు" అన్నాను అతని ప్రయత్నాన్ని వారిస్తూ.



# తరుగు

పైడిపాల

మావయ్య నా మాట వినకుండా అమ్మ చేతిలో త్రాసుపెట్టి తూయించాడు—ఆశ్చర్యం!అవి తూకానికి మూడు కేజీలేవున్నాయి.

నేను ప్రాన్పడిపోయాను !

"చూశావా అల్లుడూ, నీ కళ్ళు బాగానే పనిచేస్తున్నాయి.... వాడు ఆ తూకం రాళ్ళ అడుగు భాగాన్ని కోసేశాడన్నమాట...." మావయ్య ఏదో చెప్తున్నాడు .... నిజంగా నా చెవులు పని చెయ్యడంలేదు .... !